# క్లిక్

'పంచాయితీ' అంటే ఐదుగురు సభ్యులతో వున్న మండలి. దానికి హెడ్డు అంటే 'శిరము ఉర్దూలో 'సర్‌గా మారి సర్‌పంచ్ అయింది. అటువంటి వంద పంచాయతీలకు ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేగారు జబ్బుపడి కాలం చేశారు. కొత్త ఎమ్మెల్యే ఎన్నికకోసం నోటిఫికేషన్ జారీ అయింది. అంతకుముందు ఓడిపోయిన అభ్యర్థి శచీపతి పోటీ చేద్దామని మళ్ళీ నామినేషన్ వేశాడు. ఇంతక్రితం శచీపతిని ప్రజలు తిరస్కరించడానికి కారణం అతడు నాస్తికుడు కావడమే. మూఢ విశ్వాసాలు వేళ్లూనిన గ్రామాల్లో దేవుడూ గీవుడూ జాన్తానై అంటే ఎవరు వోటు వేస్తాడు? పచ్చకామెర్లు వస్తే కంట్లో ఏవేవో పసర్లు వేసి కళ్ళు పాడుచేసుకుంటారు. చప్పి వస్తే మంత్రం వేయించుకుంటారు. నాటువైద్యం చేయించుకోకండి, ఆరోగ్యానికి హానికరం అంటే వినేవాళ్లెవరు? అవన్నీ చెప్తాడు శచీపతి.

అందుకే చిత్తుగా ఓడిపోయాడు. ఒక మేజర్ పంచాయితీలో రామాలయం ఉంది కాని, శివాలయం లేదు. శివాలయం లేకపోవడం వల్ల ప్రజలు అకాల మరణాలకు గురి అవుతున్నారని, శివాలయ నిర్మాణానికి ఎవరు ఇరవైవేలువిరాళం ఇస్తే వారికే వోటు వేస్తామని అధిక సంఖ్యాకులు పట్టుబట్టారు. నాస్తికుడైన శచీపతి ఇరుకులో పడ్డాడు. కిందటి ఎన్నికల్లో ఆ మేజర్ పంచాయతీ ఓటర్లే తనని దెబ్బతీశారు! ఏమిటి దారి?

"ఫరవాలేదు... ఒప్పేసుకో. దేవుడిమీద నమ్మకానికి రాజకీయలకి సంబంధంలేదు. ఆ రెండింటినీ వేరువేరు కళ్ళతో చూడాలి" అని సలహా చెప్పారు శచీపతి శ్రేయోభిలాషులు.

శచీపతి శివాలయ నిర్మాణానికి ఇరవై వేలూ ఇవ్వడానికి ఒప్పేసుకున్నాడు. శచీపతిని నాస్తికత్వం నుండి ఆస్తికత్వంలోకి మార్చగలిగినందుకు ఆ గ్రామప్రజలు విజయగర్వంతో వున్నారు.

శివాలయ నిర్మాణానికి ఓ కమిటీ ఏర్పాటైంది. దానికోశాధికారికి ఇరవై వేలూ చెక్కురూపేణా అందించాడు శచీపతి. కెమేరాలు 'క్లిక్' మన్నాయి. ప్రజలు హర్షవర్షాన్ని కురిపించారు.

శచీపతి ఎమ్మెల్యే అయిపోయి మంత్రిగా కూడా ప్రమాణస్వీకారం చేశాడు.

పదిరోజులు పోయేక. "ఫండ్స్ నాట్‌ప్రావైడెడ్. రిఫర్ టు డ్రాయర్' అంటూ చెక్కు టుర్రిగా తిరిగి వచ్చింది. ఐ.పి.సి 420 క్రింద మంత్రివర్యుని మీద కేసు పెట్టడానికి ఎన్ని గుండెలుండాలి?

మే 1994

చతుర మాసపత్రిక